# మినీకథ

టిక్కెట్టు వెనుక ఏదో అస్పష్టంగా కవిపించింది ఆశగా నేలమీద పడేసిన




రామారావు మూడోసారి చేతికున్న వాచీ చూసుకున్నాడు తొమ్మిది గంటల యిరవై అయిదు నిమిషాలైంది. బస్సు బయలుదేరడానికి యింకా అయిదు నిముషాల వ్యవధి మాత్రమే వుంది. వారం రోజులనుంచీ తను అదే పనిగా చూస్తున్నాడు. ఒక రెండు జడల కోమలాంగి సరిగ్గా తొమ్మిది గంటల ముప్పై నిముషాలకు తానెక్కుతున్న బస్సులోనే ఎక్కడం, సెక్రటేరియట్ టిక్కట్టు కొనుక్కోవడం, తనేమో తన స్టాప్ ఎ. జి. ఆఫీసు రాగానే ఆమెను చూస్తూ దిగిపోవడం. ఆ సుందరాంగి చక్రాల్లాంటి కళ్ళను తన వేపుకు త్రిప్పడం. ఆ కళ్ళల్లో తనో మేఘసందేశాన్ని చదవడం పరిపాటి అయింది.

ఎప్పుడూ బస్సు బయలుదేరకముందే వచ్చే ఆమె ఆరోజు హడావిడిగా బస్సు స్టార్ట్ అయింతర్వాత వచ్చి, ఎక్కింది. మామూలుగా వేను రోజూ కూర్చుండే సీటువైపు చూసి తృప్తిగా నిట్టూర్చింది. కండక్టర్ "ఎక్కడికండీ" అన్నాడు. "సెక్రెటేరియట్" అన్నదామె. కండక్టర్ టిక్కెట్టు పంచ్ చేసి ఇచ్చాడు. బస్సు బయలుదేరింది. బస్సంతా రద్దీగా వుంది. రామారావు వంక ఓరగా చూస్తూ ఆమె కండక్టర్ యిచ్చిన టిక్కెట్టు వెనుక ఏదో రాసింది.

రామారావు స్టాపు ఎ. జి. ఆఫీసు వచ్చేసింది. అతను మామూలుగా దిగబోయి ఆమెవంక చూశాడు. ఆమె వళ్ళంతా కళ్ళు చేసుకుని అతన్నే చూస్తున్నది. రామారావు వళ్ళు పులకరించింది. కండక్టర్ బెల్ కొట్టడంతో రామారావు ఈ లోకానికి వచ్చిపడి, హడావిడిగా బస్సు దిగాడు. అతను బస్సు నుంచి దిగగానే ఆమె బస్సులోనుంచి తొంగిచూసి అతన్ని తీసుకోమన్నట్లుగా టిక్కెట్టును మడిచి కిందికి విసిరేసింది టిక్కెట్టు తీసుకుని చూశాడు.

"సాయంత్రం అయిదున్నరకు పబ్లిక్ గార్డెన్స్‌కు రండి — నళిని"

అని ఆ టిక్కట్టు వెనుక చిన్న చిన్న అక్షరాలతో వ్రాసివుంది

నళిని! అబ్బ! ఎంత అందమైన పేరు. నీలలోచనకు తగ్గ పేరు నళిని. లేత కాశ్మీరి లాగా వున్న ఆమె బుగ్గలు. చక్రాల్లా తిరిగే ఆ కళ్ళూ. ఆ కళ్ళ కొసల్లోంచి చూపే మెరుపులూ. ఎంతటివాడైనా ఆ కళ్ళకి. ఆ మెరుపులకి దాసిప కావల్సిందే.

అందమైన అమ్మాయి. అందునా పెళ్ళి కాని అమ్మాయి. ఒంటరిగా పబ్లిక్ గార్డెన్స్‌కు రమ్మంది అంటే అంతకన్నా అదృష్టం ఏముంటుంది?

ఆఫీసుకు రామారావు ఎప్పుడూ కరెక్ట్ టైంకు వెళ్ళేవాడు కాదు. సినిమాకు బయలుదేరితే సినిమా కనీసం రెండు రీళ్ళయినా అయిపోతేకాని థియేటర్‌లో అడుగు పెట్టేవాడు కాదు. ఎవరైనా పెళ్ళికి ఆహ్వానిస్తే అప్పగింతలైంతర్వాత హాజరయేవాడు! అట్లాంటి రామారావు ఆరోజు ఒక గంట ముందుగానే నాలుగుగంటల ముప్పై నిము

**ఎస్. వి. ప్రసాద్**

షాలకు పబ్లిక్ గార్డెన్స్ గేటు దగ్గర హాజరైనాడు

ఆమె రిక్షాలో హడావిడిగా అయిదు ముప్పావుకు దిగింది. "సారీ రామారావు గారూ, పావుగంట ఆలస్యం అయింది" అని మృదువుగా, లాలనగా నవ్వింది.

"మీ కోసం పావుగంట కాదు, పాతిక సంవత్సరాలు వెయిట్ చేయమన్నా చేస్తాను. మీ కోసం నిరీక్షించడంలో ఆనందం వుంది" అని అన్నాడు.

ఆమె పబ్లిక్ గార్డెన్స్‌లోని లవర్స్ కార్నర్‌కు దారితీసింది. ఆమెను అనుసరించాడు రామారావు. పచ్చటి తివాసీలా మెరుస్తున్న లాన్ మీద సుతారంగా కూర్చుంది. రామారావు ఆమెను చూస్తూ, ఆమె అందాన్ని ఆరాధిస్తూ ఏవేవో మాట్లాడాలని ఊహించుకుంటూ. తీరా ఏమీ మాట్లాడక, తన్మయత్వంలో రెండు గంటలూ రెండు సెకన్లలా గడిపాడు.

"రామారావుగారూ నాకో చిన్న సహాయం చేసిపెట్టాలి" అన్నది నళిని.

నళిని ఏం మాట్లాడినా రామారావుకు అందంగా వుంది. అతను ఏవో లోకాల్లో విహరిస్తున్నాడు. తాజ్‌మహల్‌ను ఆగ్రా నుంచి తెచ్చి హైద్రాబాద్ పబ్లిక్ గార్డెన్సులో పెట్టేటట్లున్నాడు

"మీరు అడగడం నేను కాదంటమూనా! ఏమిటో ఆజ్ఞాపించండి రాణీ గారూ" అన్నాడు రామారావు.

"మా బాబాయిగారు తాసిల్దారుగా పని చేసేవారండీ. వారు రిటైరయి రెండు సంవత్సరాలైనా ఆయన పెన్షనూ, గ్రాట్యుయిటీ కాగితాలు ఇంతవరకూ మీ ఆఫీసువారు శాంక్షన్ చేయలేదు. ఇవిగోండి ఆ రిఫరెన్సు. మీరు శ్రమ అనుకోకపోతే కాస్త వాటిని చేయిస్తే ఆజన్మాంతం మీకు మేము ఋణపడి వుంటాము" అన్నది

"ఓస్! అదేనా! అదెంత పని!" అన్నాడు రామారావు. ఆ కాగితాలు అందుకుంటూ ఆమె చేతిని మృదువుగా తాకాడు.

మర్నాడు రామారావు అన్ని సెక్షనులూ తిరిగి, అందరి దగ్గరికీ ఫైల్సు స్వయంగా తనే మోసుకునివెళ్ళి, ఆఖరికి ఆఫీసరు దగ్గరికి వెళ్ళి నళిని బాబాయిగారి కేసు తన బాబాయి కేసని బుకాయించి, అవసరమైన చోటల్లా అందమైన అబద్ధాలు చెప్పి, ఆర్డర్సు పాస్ చేయించాడు.

ఆ మర్నాటి సాయంత్రం బస్‌స్టాప్ దగ్గిర ఆర్డరు కాపీ ఆమె చేతులకు తనే స్వయంగా అందించాడు. ఆ అందించడంలో ఆమె చేయి అతని చేతిని మృదువుగా, మధురంగా తాకింది. వెయ్యి వీణలు మీటినట్లయింది రామారావుకి. ఆ రాత్రి కోటి కలలు కన్నాడు.

మళ్ళీ నాలుగు రోజుల వరకూ నళిని కలవలేదు. అయిదోరోజు బస్సులో కలిసింది. టిక్కట్టు తీసుకొని ఏదో దానిమీద రాసింది.

రామారావు తన కేమైనా శుభవార్త అందిస్తుందేమోనని తన స్టాప్ ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తూ బస్సులో జపంచేస్తున్నాడు.

రామారావు దిగే స్టాప్ వచ్చింది. ఒక్కసారి నళిని వేపు చూశాడు. నళిని వాలుచూపులతోబాటు టిక్కెట్టునూ, టిక్కట్టుతో పాటు మరో చీటీని విసిరేసింది.

గబగబా బస్సుదిగి ఎంతో ఆతురతతో టిక్కట్టు వెనుకవైపు చూశాడు. టిక్కట్టు మీద "చీటీ చూడండి" అని వ్రాసివుంది.

చీటీకోసం వెయ్యి కళ్ళతో వెతికాడు. బస్సు హడావిడిగా యెక్కేవాళ్ళ బూట్ల కాళ్ళక్రింద పడి నలిగి జాలిగా చూసింది చీటీ. నళినిజాలిగా చూస్తోందనుకున్నాడు.

తనకూ నళినికీ పెళ్ళయిన తర్వాత నళిని చూసే మొదటి రాత్రి చూపు అట్లా వుంటుందేమోనని ఊహించుకున్నాడు. ఆతురతతో గబగబా చీటీ మడతలు విప్పి చదవసాగాడు

"సారీ రామారావుగారూ! నాకు ఇదివరకే పెళ్ళయిపోయింది. నేను సెక్రటేరియట్‌లో కానీ, ఏ ఆఫీసులో కానీ పని చేయటంలేదు. మా బాబాయిగారి పెన్షను కేసు మీ ఆఫీసులో రెండు సంవత్సరాల నుంచీ పెండింగులో వుందని తెలిసి, ఈ వారం రోజులూ మీతో నాటకం ఆడాను. మా బాబాయిగారు, మా శ్రీవారు మీకు థాంక్సు చెప్తున్నారు."

రామారావు తలెత్తి చూసేసరికి బస్సులోంచి చెయ్యి వూపుతూ నవ్వుతూ కనిపించింది నళిని.

## మద్యము

కూజాలోంచి వంచుకో
కుండ అయితే ముంచుకో
ఆస్వాదన యే తీరయినా
'అంతమొ'క్కటి గుర్తుంచుకో



అంతదాకా__
అంకించుకుని ఆసాదించుకో
ఆజన్మ మరణాంతం__
అన్ని సుఖాలూ కురిపించుకో.

—ఎ. ప్రహ్లాదరావు

